### ప్రభుత్వం పునరాలోచించాలి



ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 10 : ఆదివాసీ జిల్లాలో యంగ్ ఇండియా స్కూళ్లు ప్రారంభిస్తే ఇక్కడి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికే జిల్లాలో అనేక మంది గిరిజన విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జిల్లాకు యంగ్ ఇండియా స్కూల్‌ను మంజూరు చేయాలి. అప్పుడే అడవిబిడ్డలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుంది. అక్షరాస్యత శాతం కూడా పెరుగుతుంది.

*- వేణుగోపాల్, అధ్యాపకుడు, ఆసిఫాబాద్*

### జిల్లాకు కేటాయించక పోవడం అన్యాయం



ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కూల్‌ను ఆసిఫాబాద్ జిల్లాకు కేటాయించకపోవడం అన్యాయం. మంచి విద్య అందుబాటులో ఉన్న పట్టణాల్లో ఇలాంటి ప్రాజెక్టులు ప్రారంభించడంకన్నా అక్షరాస్యతలో వెనుకబడి ఉన్న ఆసిఫాబాద్‌లాంటి జిల్లాపై దృష్టిపెట్టాలి. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేసి ఇక్కడి నిరుపేద విద్యార్థులకు న్యాయం చేయాలి.

*- కార్తీక్, అధ్యాపకుడు, ఆసిఫాబాద్*

### విద్యారంగ అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే



బెల్లంపల్లి, అక్టోబర్ 10 : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాలు మంజూరు చేశారు. కానీ బెల్లంపల్లి నియోజకవర్గానికి మాత్రం మొండి చేయి చూపించారు. ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాల మంజూరులో కూడా నియోజకవర్గానికి తీరని అన్యాయం జరిగింది. కళాశాలలు, ఇతర విద్యారంగ అభివృద్ధికి ఎమ్మెల్యే తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగంపట్ల ఉదాసీనత వైఖరి అవలంబిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఇంతవరకు విడుదల చేయలేదు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా విద్యారంగానికి ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. ఇప్పటికైనా ఇంటిగ్రేటెడ్ హాస్టల్ జాబితాలో బెల్లంపల్లి నియోజకవర్గాన్ని కూడా చేర్చాలి.

*- దీపక్‌కుమార్, బెల్లంపల్లి*

# లక్షల లాభాలు ఎగ్గొట్టి విందులా ?

- సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం తగదు
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

శ్రీరాంపూర్, అక్టోబర్ 10 : 'సింగరేణిలో అసలు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. అంతా గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కార్మికులు కష్టపడి రూ. 4701 కోట్ల లాభాలు సాధిస్తే.. వారికి లక్షలాది రూపాయల వాటా ఎగ్గొట్టి కేవలం రూ. 150తో విందు భోజనాలు పెట్టడం ఏమిటి' అని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం 'నమస్తే తెలంగాణ'తో వారు మాట్లాడుతూ యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘాన్ని విస్మరిస్తూ సొంత నిర్ణయాలు తీసుకుంటున్నదని, సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యాన్ని పెంచి పోషించడం వల్ల సంస్థ అభివృద్ధికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయన్నది గుర్తించాలన్నారు. ప్రతి కార్మిక కుటుంబానికి కేజీ స్వీట్ బాక్స్ చొప్పున అందిస్తే ఇంటిల్లిపాది సంతోషపడేవారని, కానీ సద్దుల బతుకమ్మ, దసరా పండుగల రోజుల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో గైర్హాజరుండే సమయంలో బడాకాన్(భోజనాలు) పెట్టడం ఏమిటని ఫైర్ అయ్యారు. ఉజ్వల సదస్సుల పేరిట రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కనీసం గుర్తింపు కార్మిక సంఘానికి కూడా సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా యాజమాన్యం నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.



- నిరాశలో మిగిలిన ఎనిమిది నియోజకవర్గాల వాసులు
- కాంగ్రెస్‌ను గెలిపించలేదనే వివక్ష అంటున్న విద్యావంతులు
- ఉమ్మడి జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్



# మాకేవి యంగ్ ఇండియా స్కూల్స్

## ఉమ్మడి జిల్లాలో రెండు నియోజకవర్గాలకే అవకాశం

మంచిర్యాల ప్రతినిధి/నిర్మల్, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలను ఎంపిక చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది నియోజకవర్గాలు ఉండగా.. మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లో నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. నేడు(శుక్రవారం) పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలు ఉంటే కేవలం 28 నియోజకవర్గాలను ఎంపిక చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు ఒకటి చొప్పున 33 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటే అందరికీ సమప్రాధాన్యం ఇచ్చినట్లు అయ్యేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పుడు విడుదల చేసిన జాబితాలో అధికార పార్టీ మంత్రులు, ఆ పార్టీ సీనియర్ నాయకులు ఉన్న నియోజకవర్గాలనే ఎంపిక చేశారని మండిపడుతున్నారు. కాగా.. ఒక్కో స్కూల్‌ను 20 నుంచి 25 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. అలాగే స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణాలు, ఇతర మౌలిక సధుపాయాల కల్పనకు మరో రూ.25 కోట్లను వెచ్చించనున్నది.

### ఉమ్మడి జిల్లాకు అన్యాయం

ఉమ్మడి జిల్లాల ప్రాతిపాదికన ఈ విషయంలో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్రమైన అన్యాయం జరిగిందని విద్యావంతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెనుకబడిన జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సర్కారు పదింటిలో ఒక్క నియోజకవర్గాన్నే ఎంపిక చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు అన్ని నియోజకవర్గాలు, అన్ని జిల్లాలకు సమప్రాధాన్యం ఇచ్చేదని గుర్తు చేసుకుంటున్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఏదో ఒకటి చేసి సక్సెస్ అయ్యాక.. మిగిలినవి చేయొచ్చు గా ప్రత్యేకించి 28 సెలెక్ట్ చేయడం వెనుక మతలాబేంటో చెప్పాలంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పదింటిలో కేవలం నాలుగు స్థానాలు మాత్రమే అధికార పార్టీ గెలిచింది. అందుకే మంచిర్యాల మినహా మిగతా జిల్లాలపై సర్కార్ వివక్ష చూపిందని మండిపడుతున్నారు. గెలిచిన నలుగురు మంత్రి పదవి కోసం పైరవీలు చేయడమే తప్ప.. అభివృద్ధి విషయంలో కొట్లాడి న్యాయం చేసే ఆలోచన ఎవరూ చేయడం లేదంటున్నారు. యంగ్ ఇండియా స్కూల్స్ విషయంలో ఆదిలాబాద్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తూ.. మరిన్ని స్కూళ్లకు మంజూరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### అడవి బిడ్డలకు దక్కని ప్రాధాన్యత

ఖానాపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఎంపిక చేయలేదు. గిరిజనులు, ఆదివాసులు ఎక్కువగా ఉండే ఖానాపూర్ నియోజకవర్గాన్ని అయినా మొదటి విడుతలో ఎంపిక చేసి ఉంటే ఈ ప్రాంత గిరిజన బిడ్డలకు మేలు జరిగేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్ష్యరాస్యత శాస్త్రీయతపై ఎలాంటి సర్వేలు గాని నిర్ధారణ గాని జరపకుండానే అడ్డగోలుగా కేటాయింపులు జరిపారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఈ స్కూళ్ల ఎంపికలో మారుమూల ప్రాంతాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### పదవి మీదున్న కాంక్ష ప్రగతి మీద లేదు



బెల్లంపల్లి, అక్టోబర్ 10 : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు పదవి మీద ఉన్న కాంక్ష ప్రగతి మీద లేదు. టూరిస్టులా వ్యవహరి స్తున్నాడు. విద్యారంగంపై దృష్టి సారించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి కొన్ని నియోజకవర్గాలకు మాత్రమే పరిమితం చేసింది. బెల్లంపల్లి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయకపోవడం సరికాదు. ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాల మంజూరులో కూడా తీరని అన్యాయం జరిగింది. కళాశాలలు, ఇతర విద్యారంగ అభివృద్ధికి ఎమ్మెల్యే తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంవల్లే మనకు నష్టం కలుగుతోంది. ఇప్పటికైనా ఇంటిగ్రేటెడ్ హాస్టల్ జాబితాలో బెల్లంపల్లి నియోజకవర్గాన్ని కూడా చేర్చాలి.

*-అడ్డూరి వెంకటస్వామి, బెల్లంపల్లి*

### లిస్టులో మా జిల్లా లేదు



ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియళ్లను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఆ లిస్టులో మా జిల్లా లేకపోవడం బాధేసింది. మారుమూల ఆదివాసీ జిల్లా అయినందునే చిన్నచూపు చూసినట్లు ఉంది. ఇప్పటికైనా సర్కారు స్పందించి మా మారుమూల జిల్లాకు ఇంటిగ్రేటడ్ పాఠశాలను మంజూరు చేయాలి.

*- నక్క సుధాకర్, కౌటాల, డిగ్రీ, పీజీ*

### బాధాకరం



కౌటాల, అక్టోబర్ 10 : రాష్ట్రంలోనే మా నియోజకవర్గం ఒకటో నంబర్. కానీ అభివృద్ధి, సంక్షేమ పథకా ల అమలులో మాత్రం చిట్ట చివరన ఉంటుంది. పాలకుల నిర్లక్ష్యానికి మారుమూల ప్రాంత విద్యార్థులకు తీవ్ర అన్యా యం జరుగుతుంది. ఇంటిగ్రేటెడ్ విద్య కోసం సిర్పూర్ నియోజకవర్గాన్ని ఎంపిక చేయక పోవడం బాధాకరం. రాజకీయాలు పక్కన పెట్టి ఇక్కడి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలి.

*- ముర్‌మురే వాయు కుమార్, కౌటాల, డీఎడ్, పీజీ*



ఉపాధ్యాయులుగా ఎంపికైన వారితో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

# నాణ్యమైన విద్యనందించాలి

### కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 10 : ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ మైదానంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కటకం మధుకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు మరియాల ఉదయ్ బాబు, జిల్లా ఆర్థిక, గణాంక అధికారి జాడిదేవాజీ, జిల్లా కార్యదర్శి చిలుకూరి రవీందర్, కాగజ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.



ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న నూతన ఉపాధ్యాయులు

# భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్, అక్టోబర్ 10 : ఉపాధ్యాయులు నాణ్యమైనవిద్యనందించి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి డీఈవో యాదయ్యతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు త్వరలోనే పాఠశాలల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, ఎంఈవోలు, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బతుకమ్మ ప్రత్యేక గీతరం సీడీ ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరామ్

# సీడీ ఆవిష్కరించిన సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, అక్టోబర్ 10 : సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన బతుకమ్మ ప్రత్యేక గీతాన్ని(సీడీ) గురువారం హైదరాబాద్‌లో సీఎండీ ఎన్ బలరామ్ ఆవిష్కరించారు. బతుకమ్మ ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా పాట రాసిన ప్రజాకవి, సింగరేణి ఉద్యోగి జయరాజును ఆయన అభినందించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు. సింగరేణి వ్యాప్తంగా బతుకమ్మ సంబురాల నిర్వహణకు యాజమాన్యం విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం (కోఆర్డినేషన్), సీపీఆర్వో ఎస్‌డీఎం సుభానీ పాల్గొన్నారు.

# తహసీల్దార్‌పై ఫిర్యాదు

కౌటాల, అక్టోబర్ 10 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద కౌటాల తహసీల్దార్‌పై కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు అదే గ్రామానికి చెందిన ఆదివాసీ యువకులు గురువారం ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కొలావార్‌కు చెందిన వారికి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని యువకులు ఆరోపించారు. గతంలో తమకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని, ప్రస్తుతం సాకులు చెబుతూ తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ తహసీల్దార్‌తో మాట్లాడి న్యాయం చేస్తానన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కౌటాల యువకులు



జిల్లాకు వచ్చిన బతుకమ్మ చీరలను దింపుతున్న కూలీలు



పంపిణీ చేయనున్న బతుకమ్మ చీరలు

# బతుకమ్మ చీరలిస్తరట!

- ఆరు ఐటీడీఏ పరిధిలోని జిల్లాల్లోనే పంపిణీ చేయనున్న సర్కారు
- ఈ నెల 15 నుంచి అందించేందుకు కార్యాచరణ
- పండుగ ముగిశాక ఇచ్చి ఏం లాభమంటున్న మహిళలు

మంచిర్యాల, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే బతుకమ్మ పండుగను రాష్ట్ర సర్కారు చిన్నచూపు చూస్తున్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల్లో ఆనందం నింపేందుకు చీరల పంపిణీకి శ్రీకారం చుట్టి.. పండుగకు ముందే అందించగా, కాంగ్రెస్ సర్కారు మాత్రం అంతా అయిపోయాక ఇచ్చేందుక ప్రణాళికలు రూపొందించింది. అదీ..కూడ రాష్ట్రంలోని ఐటీడీఏ పరిధిలోని ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌బాద్ జిల్లాల్లో మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆయా జిల్లాల్లో 12 లక్షల చీరలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు జిల్లాలకు పూర్తి స్థాయిలో చీరలు చేరుకోలేదని సమాచారం. గురువారం మూడు లోడ్‌లలో చీరలు రాగా గోదాంలలో భద్రపరిచారు. కాగా, సద్దుల బతుకమ్మ ముగిశాక చీరలిచ్చి ఏం లాభమంటూ మహిళలు మండిపడుతున్నారు.

### పంపిణీ ఆపేయమంటూ ఆదేశాలు

బతుకమ్మ చీరల పంపిణీని ఈనెల 7న ప్రారంభించాల్సి ఉండగా, ఆ కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆదేశాలు అందినట్లు తెలిసింది. బతుకమ్మ పండుగకు అందాల్సిన చీరలు.. ఆ తర్వాత ఇస్తే ఏం చేసుకుంటామని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ చీరలను స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు 18 సంవత్సరాలు నిండిన ఎస్టీ మహిళలకు మాత్రమే పంపిణీ చేయనున్నారు.

### జిల్లాల వారీగా పంపిణీ చేయనున్న చీరలు

| జిల్లా పేరు | ఎస్‌హెచ్‌జీ మెంబర్ | 18 ఏళ్లు నిండిన ట్రైబల్ ఉమెన్ | మొత్తం |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 1,18,545 | 83752 | 2,02,297 |
| భద్రాద్రి | 1,80,642 | 1,48,263 | 3,28,905 |
| ఆసిఫాబాద్ | 91,709 | 50,821 | 1,42,530 |
| మహబూబాబాద్ | 1,60,843 | 1,08,480 | 2,69,323 |
| మంచిర్యాల | 1,16,700 | 21,064 | 1,37,764 |
| ములుగు | 72,295 | 33,155 | 1,05,450 |



మంచిర్యాల విశ్వనాథాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# అంబరాన్నంటిన 'సద్దుల' సంబురం

- కనుల పండువగా పెద్ద బతుకమ్మ వేడుకలు
- అలరించిన ఆడబిడ్డల ఆటాపాటలు
- వాగులు, చెరువుల్లో నిమజ్జనం

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తీరొక్కపూలతో బతుకమ్మలను అందంగా పేర్చిన ఆడబిడ్డలు.. సాయంత్రం ప్రధాన కూడళ్లలో పెట్టి ఆడిపాడారు. డీజే పాటలపై నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. కోలాటాలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. సత్తులు పంచుకొని తిన్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు పాల్గొని తిలకించారు. ఆయాచోట్ల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాళ్లవాగులో బతుకమ్మను నిమజ్జనం చేస్తూ..



బెజ్జూర్ : కుకుడలో వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వెళ్తూ..



మందమర్రి మేదరి బస్తీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు